సాక్షి నిర్మల్

బుధవారం । 14 । ఆగస్టు । 2024



రావమ్మా.. మహాలక్ష్మి

ఈ నెల 14 నుంచి 19 వరకు వరుస సెలవులు రానున్నాయి. ఉమ్మడి జిల్లాలోని డిపోల నుంచి ప్రధాన రూట్లలో ఆర్టీసీ అదనపు బస్సులు నడపనుంది. 8లో▸



ఏం కొనేటట్టు లేదు.. 9లో▸

కూరగాయల ధరలు అమాంతం పెరగడంతో నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రజలు కొనుగోలు చేసేందుకు అల్లాడుతున్నారు.

గరిష్టం/కనిష్టం 32.6 /26.7

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పంద్రాగస్టు అతిథి రాజయ్య



రాజయ్య

నిర్మల్: పంద్రాగస్టు రోజు జిల్లా కేంద్రంలో తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య జెండావిష్కరణ చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లో నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో ఎవరెవరు జెండా విష్కరణ చేయాలో వారి జాబితాను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈమేరకు మాజీ ఎంపీ, ప్రస్తుత రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా ఉన్న రాజయ్య జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో అధికారికంగా నిర్వహించే కార్యక్రమంలో జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. రాజయ్యకు ఉమ్మడి జిల్లాతో అనుబంధం ఉంది. గతంలో ఆయన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపరిషత్ సీఈవోగా చేశారు.

అభివృద్ధిపథంలో భారత్



జాతీయ గీతాలాపన చేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో దూసుకెళ్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్‌పై అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతీయ గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం అంజు కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే తరాలకు వికసిత భారత్, అభివృద్ధి భారత్ అందించేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా వడ్డెర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా, పట్టణ, యూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు దండుగుల సాయిలు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా బొంత చిన్నఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా పల్లపు రవీందర్, కార్యదర్శిగా దండుగుల లక్ష్మణ్, యూత్ జిల్లా అధ్యక్షుడిగా తమ్మిశెట్టి మారుతి, పట్టణ అధ్యక్షుడిగా తమ్మిశెట్టి శ్రీనివాస్, పట్టణ మహిళా అధ్యక్షురాలిగా దండుగుల పద్మ, జిల్లా సలహాదారులుగా కుంచపు పోశెట్టి, ఇడగొట్టు శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా కుంచపు పోశెట్టి, సలహాదారులుగా మక్కల నాగన్న, ఓల్లెపు రవి, దండుగుల రాజు, దేవోల్ల సురేష్, ర్యాపస్ సత్యనారాయణ, బొంత ఎల్లయ్య, బొంత గంగాధర్, ఓల్లెపు చిన్నయ్య, దండుగుల చిన్నయ్య, బొంత నడిపి ఎల్లయ్య, దండుగుల రమేశ్, ఓల్లెపు పోశెట్టి, సంపంగి గంగాధర్, ఓర్సు పెద్దరెడ్డి, కుంచపు గణేశ్‌ను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

టీపీసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా లావణ్య



లావణ్య

లక్ష్మణచాంద: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)రాష్ట్ర మీడియా–కమ్యూనికేషన్ కోఆర్డినేటర్‌గా ఎన్టీ లావణ్య నియామకమయ్యారు. చామన్‌పెల్లి గ్రామానికి చెందిన రాజేశ్వర్–గంగామణి దంపతుల కుమార్తె అయిన లావణ్య ఎల్ఎల్‌బీ పూర్తి చేసి ప్రస్తుతం హైకోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తోంది. వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నందువల్ల ఆమెకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

భైంసాటౌన్: ఆర్టీసీ ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఆర్ఎం సాలోమాన్ రాజ్ అన్నారు. మంగళవారం భైంసా డిపోను సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం ఛాలెంజ్‌లో భాగంగా లక్ష్యం మేరకు ఆదాయం చేకూరేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎం హరిప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

నషా ముక్త్ నిర్మల్ కోసం..



ఫిబ్రవరిలో పోలీసులు పట్టుకున్న అంతర్రాష్ట్ర గంజాయి ముఠా

- గంజాయిపై పోలీసుల నజర్
- జిల్లాలో అమ్మకాలపై ఉక్కుపాదం
- ఇటీవల వరుసగా అరెస్టులు, కేసులు
- జిల్లాలోనూ డీ అడిక్షన్ సెంటర్..!

నిర్మల్: గంజాయి భూతం యువతను పట్టి పీల్చేస్తోంది. వాళ్ల జీవితాలనే కాదు, వారి కుటుంబాలనూ గుల్లచేస్తోంది. మత్తుకు బానిసలుగా చేసి, ఉజ్వల భవిష్యత్తును నాశనం చేస్తోంది. జిల్లాలో ఎంతోమంది యువకులు, వారి కుటుంబాల బతుకులను ఆగం చేస్తోంది. ఈక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా గంజాయిని అరికట్టే దిశగా సీరియస్‌గా చర్యలు సాగుతున్నాయి. జిల్లాలోనూ ఎస్పీ జానకీ షర్మిల నేతృత్వంలో పోలీసులు 'నషా ముక్త్ నిర్మల్' కోసం శ్రమిస్తున్నారు. గంజాయి అమ్మకాలు, కొనుగోళ్లపై పక్కాగా దృష్టి పెడుతున్నారు. క్షేత్రస్థాయికి ఎక్కడి నుంచి వస్తుందని ఆరా తీస్తూ.. ఒక్కొక్కరినీ అదుపులోకి తీసుకుంటున్నారు. ఇటీవలే వరుసగా మూడు గంజాయి కేసులు నమోదు చేశారు.

సులభంగా ఉంటుందని..

మద్యం, సిగరెట్ వంటి మత్తుపదార్థాలు ఉన్నా.. ఇటీవల గంజాయి వాడకం పెరిగింది. ప్రధానంగా దీని ద్వారా సేవించిన వారికి సులువుగా మత్తు ఎక్కడం, విక్రయించిన వారికి సులభంగా డబ్బులు వస్తాయన్న ఆశ ఉండటంతో అటు మత్తు బానిసలు, ఇటు విక్రేతలు పెరుగుతున్నారు. కానీ.. ఈ మత్తు తమను మింగేస్తోందని వారు ఆలోచించడం లేదు. గంజాయి వాడినా.. విక్రయించినా.. జైలుపాలు కావాల్సిందే. గంజాయి మత్తుబారిన పడి ఇప్పటికే ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. కొంతమంది యువకులు దొంగతనాలు, ఇతర నేరాలకూ పాల్పడి జైళ్లలో శిక్ష అనుభవిస్తున్నారు. నిండు జీవితాన్ని అర్ధాంతరంగా ముగించుకున్న వాళ్లూ ఉన్నారు.

నషాముక్త్ కోసం..

ఒకవైపు గంజాయి విక్రయాలపై పోలీసులు సీరియస్‌గా దృష్టి పెడుతూనే మరోవైపు యువత మత్తులో పడకుండా ప్రయత్నిస్తున్నారు. గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. గతంలో పలువురు యువకులను స్థానిక ఆస్పత్రులతో పాటు నిజామాబాద్‌కు సైతం పంపించి కౌన్సెలింగ్ ఇప్పించారు. కళాబృందాల ద్వారా గ్రామాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మరోసారి జిల్లాల్లో డీ అడిక్షన్ సెంటర్ల ఏర్పాటుపై ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలో జిల్లాలోనూ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి. పలు స్వచ్ఛంద సంస్థలు కూడా 'గంజాయి భూతాన్ని పారదోలుదాం' అంటూ ప్రచారం చేస్తున్నాయి.

సీరియస్‌గా దృష్టి..

రాష్ట్ర ప్రభుత్వం గంజాయిపై ఫోకస్ పెట్టడంతో జిల్లా పోలీసులు సైతం సీరియస్‌గా నజర్ పెట్టారు. ఇటీవల కాలంలోనే మూడు గంజాయి కేసులు నమోదు చేశారు.

- ఫిబ్రవరి 8న నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్ జంక్షన్ సమీపంలో జిల్లా పోలీసులు ఏడుగురు సభ్యులున్న అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6 లక్షల 20వేలు విలువ చేసే 24.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- ఏప్రిల్ 22న జిల్లా కేంద్రంలోని కుర్రన్నపేట మున్నూరుకాపు సంఘ భవనం సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 380 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు.
- జూలై 26న ముధోల్‌లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు పెడ్లర్స్‌ను పట్టుకున్నారు. వారివద్ద నుంచి 443 గ్రాముల గంజాయి ప్యాకెట్లను స్వాధీన పర్చుకుని జైలుకు తరలించారు.
- తాజాగా ఆదివారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద గంజాయి విక్రయిస్తున్న ఒకరి వద్ద 450 గ్రాములు, అతనికి విక్రయించిన మరోవ్యక్తి వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. వీరిద్దరూ వ్యాపారం, సేవా కార్యక్రమాల ముసుగులో ఈ దందా చేస్తుండడం గమనార్హం.

సమాచారమిస్తే చర్యలు



గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు సీరియస్‌గా ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే పలు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశాం. ఎక్కడైనా గంజాయి వాడకం, విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారమివ్వాలని కోరుతున్నాం. యువత మత్తుకు బానిసలు కావొద్దని, భవితను నాశనం చేసుకోవద్దని కోరుతున్నాం.

– జానకీ షర్మిల, ఎస్పీ

వేడుకల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వేడుకల ఏర్పాట్లను అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతిబింబించేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లు, శకటాలను ఏర్పాటు చేయాలన్నారు. స్వాతంత్య్ర సమరయోధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టులు, విద్యార్థులు, ప్రజలకు ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం 'స్వచ్ఛదనం–పచ్చదనం'

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాల అదనపు కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛదనం–పచ్చదనం, మహిళాశక్తి, పలు అభివృద్ధి సంక్షేమ పథకాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పథకాల అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. మహిళాశక్తి క్యాంటీన్లు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నెలలో ప్రతీ మొదటి, మూడవ శనివారం శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలని, పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించడానికి ఇప్పటికే గ్రామాల్లో 89 స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతీ శుక్ర, మంగళవారాల్లో డ్రైడే కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలన్నారు. సీజినల్ వ్యాధుల నియంత్రణకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జెడ్పీసీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సుంకిశాల కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

భైంసాటౌన్: హైదరాబాద్‌కు తాగునీరందించే సుంకిశాల ప్రాజెక్ట్ నిర్మాణ దశలోనే కూలిపోవడంపై ఎమ్మెల్యే పి.రామారావుపటేల్ మండిపడ్డారు. ఈ మేరకు కాంట్రాక్టర్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో కలిసి నల్గొండ జిల్లాలోని సుంకిశాల ప్రాజెక్టును సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణదశలోనే కూలుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయని, రూ.వేల కోట్ల ప్రజాధనం దోపిడీకి పాల్పడుతున్న మెగా కృష్ణారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, ముధోల్ నియోజకవర్గంలోనూ చేపట్టిన పనులపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

సదర్మాట్ ఆయకట్టుకు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఖానాపూర్: ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ మండలాల్లోని సదర్మాట్ ఆయకట్టుకు మంగళవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నీటిని విడుదల చేశారు. ఖానాపూర్ మండలంలోని మేడంపల్లిలో గల సదర్మాట్ ఆనకట్ట వద్ద గేట్లను పైకెత్తి కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సదర్మాట్ ఆయకట్టు రైతుల చిరకాల కోరిక బ్యారేజీ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని, ఈ నెల 25లోగా మామడ మండలం పొన్కల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తయారు చేయించిన స్పోర్ట్స్ యూనిఫాంను క్రీడాకారులకు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. అంతకుముందు బాదనకుర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్షల్లో అత్యధిక జీపీఏ సాధించిన 9 మంది విద్యార్థులకు విద్యా సామగ్రితో పాటు రూ.వెయ్యి చొప్పున నగదు అందజేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేశ్, పాఠశాల హెచ్ఎం బీ.నరేందర్, నాయకులు జంగిలి శంకర్, రాజునాయక్, మాజీద్, స్వప్న, సాగర్, ఇమ్రాన్, సోయబ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కడెం: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయా గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, వాజీద్‌ఖాన్, భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా బంద్



నారాయణరెడ్డి మార్కెట్‌లో మూసిఉన్న దుకాణాలు

నిర్మల్‌చైన్‌గేట్: బంగ్లాదేశ్‌లో హిందువుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. హిందూ ఐక్యవేదిక సభ్యులు ఊరేగింపుగా బయలుదేరి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కరువైందని, వెంటనే వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై బీజేపీ కుట్ర



ర్యాలీగా వెళ్తున్న నాయకులు

తానూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మనువాద పార్టీ బీజేపీ కుట్ర అని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమ కమిటీ నాయకులు, భీం ఆర్మీ జిల్లా అధ్యక్షుడు విఠల్ కాంబ్లె అన్నారు. మంగళవారం ఉద్యమంలో భాగంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశాన్ని 2004లో కొట్టివేసిన సుప్రీంకోర్టు ఇప్పుడు ఎందుకు అనుకులంగా తీర్పు ఇచ్చిందని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగం విరుద్ధమైన నిర్ణయాలు సరికాదని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాలలకు అసంతృప్తిని మిగిల్చిందని అన్నారు. దేశంలోని మాల, మాదిగలను విడదీసేందుకు ఓట్ల రాజకీయానికి కుట్రపన్నుతున్నారన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేడ్కర్ చౌక్ నుంచి ర్యాలీగా బయలుదేరి తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ లింగమూర్తికి వినతిపత్రం అందజేశారు. భీం ఆర్మీ కార్యదర్శి సాహెబ్‌రావ్ జగ్ని, శ్రీనివాస్, భీంరావ్ పవార్, సురేకంత్ పవార్, భగవాన్ పవార్, పాండురంగ్, సిర్‌సాగర్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై తలెత్తిన వివాదం



ఆందోళనకారులను సముదాయిస్తున్న పోలీసులు

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కూర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్‌లో నెలకొన్న తాగునీటి సమస్యపై వివాదం తలెత్తింది. గ్రామంలోని తాగునీటి బావి మోటార్ చెడిపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడింది. దీంతో బీఆర్ఎస్ నాయకులు పంచాయతీ సిబ్బంది సహకారంతో కొత్త మోటారును ఏర్పాటు చేసి నీటిసరఫరా చేయించారు. కాంగ్రెస్ నాయకులు తమకు సమాచారం ఇవ్వకుండా తాగునీటి సరఫరా ఎలా చేస్తారని వాగ్వాదానికి దిగారు. దీంతో గ్రామస్తులు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఖాళీ బిందెలతో గ్రామంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఇరుపార్టీల ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన విరమింపజేయించారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ నిరసన



సహపంక్తి భోజనం చేస్తున్న గ్రామస్తులు

దిలావర్‌పూర్: మండల కేంద్రానికి సమీపంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనే నిలిపి వేయాలంటూ దిలావర్‌పూర్ మండల కేంద్రంలో మంగళవారం గ్రామస్తులు బంద్ నిర్వహించారు. ఈనేపథ్యంలో బస్టాంట్ ప్రాంతంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ప్రజలు ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బంద్ నేపథ్యంలో గ్రామంలోని దుకాణ సముదాయాలు మూకుమ్మడిగా మూసివేశారు. దీక్షా శిబిరం వద్ద నిర్మల్–భైంసా రహదారిపై వంటావార్పు నిర్వహించారు. కార్యక్రమానికి జేఏసీ నాయకుడు విజయ్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఇథనాల్ ఫ్యాక్టరీ తో మండలంలోని పలు గ్రామాల్లోని వ్యవసాయ భూములు దెబ్బతినడమే కాకుండా ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫ్యాక్టరీని వేరేచోటుకు తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన యువకులు, రైతులు పాల్గొన్నారు.

నిర్మల్ చుట్టూ.. గొలుసు కట్టు



నిర్మల్ జిల్లా చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి గొలుసు కట్టు చెరువులు. నిర్మల్‌ను పాలించిన నిమ్మనాయుడు ప్రజల తాగు, సాగునీటి కోసం జిల్లా కేంద్రం చుట్టూ 11 గొలుసుకట్టు చెరువులు, వీటితోపాటు పెద్దపెద్ద కోటలు, బురుజులు నిర్మించారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న గొలుసు కట్టు చెరువులు ఒక దానికొకటి అనుసంధానమై ఉన్నాయి. ఇందులో బంగల్‌పేట్ చెరువు, ఖజానా చెరువు, ఇబ్రహీం ట్యాంక్, రామ్‌సాగర్, రామ్ సీతసాగర్, చిన్నచెరువు, కంచరోని, ధర్మాసాగర్, కురాన్‌పేట్ చెరువు, కొత్తచెరువు, మూతి తలాబ్ చెరువు అనుసంధానమై ప్రకృతి ప్రేమికులను ఇప్పటికీ ఆకట్టుకుంటున్నాయి. జిల్లా కేంద్రంలోని బత్తీస్ ఘడ్ కోట పైనుంచి గొలుసుకట్టు చెరువులు ఇలా దర్శనమిస్తున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఏబీవీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

నిర్మల్‌చైన్‌గేట్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడిని ఖండిస్తూ మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుండి వివేకానంద చౌరస్తా వరకు విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు శివకుమార్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి చేయడం అమానుషమని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధురాలి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వరలక్ష్మినగర్‌కు చెందిన వృద్ధురాలు బొత్తు గంగమ్మ (70) ఈనెల 10 నుంచి కనిపించకుండా పోయింది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబీకులు ఆమె కోసం గాలించినా ఆచూకీ దొరకలేదు. మంగళవారం ఆమె మనవరాలు వరలక్ష్మి టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా హెడ్‌కానిస్టేబుల్ మదన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలిటికల్ సైన్స్‌లో స్టేట్ సెకండ్ ర్యాంకు


విజయ్‌కుమార్

బోథ్: ఇటీవల విడుదలైన ఉమ్మడి విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షల ఫలితాల్లో ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో పిప్పల్‌ధరి గ్రామవాసి మల్యాల విజయ్‌కుమార్ స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించాడు. మండల వాసులు, గ్రామస్తులు అతన్ని అభినందించారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి


షేక్ మక్దూం మృతదేహం

ముధోల్: మండలంలోని చించాల పంచాయతీ అనుబంధ గ్రామమైన పిప్రీకి చెందిన షేక్ మక్దూం(45) విద్యుత్‌షాక్ గురై మంగళవారం రాత్రి మృతిచెందాడు. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మక్దూం ఇంట్లో కరెంటు రావడం లేదని ఇంటి పక్కనే ఉన్న పెద్ద కర్రతో స్తంభం వైర్‌కు తగిలించాడు. ఒక్కసారిగా విద్యుత్‌షాక్ గురై కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి, అటు నుంచి భైంసా ఏరియాసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

అన్నదమ్ముల గొడవ

- కూలీ డబ్బుల విషయంపై ఘర్షణ
- తమ్ముడి దాడిలో అన్న మృతి
- మోతుగూడలో ఘటన


సంజయ్‌కుమార్ మృతదేహం

ఆసిఫాబాద్‌రూరల్: కూలీ డబ్బుల విషయంలో అన్నదమ్ములు గొడవపడ్డారు. ఈ ఘర్షణలో తమ్ముడి దాడిలో అన్న మృతిచెందాడు. మండలంలోని మోతుగూడలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ సతీశ్ కథనం ప్రకారం..మోతుగూడలో ఆర్‌సీసీ పైపుల ఫ్యాక్టరీ కంపెనీలో బీహార్‌కు చెందిన 12 మంది పని చేస్తున్నారు. యజమాని వరప్రసాద్ సోమవారం వారికి కూలీ డబ్బులు ఇచ్చారు. డబ్బుల విషయమై రాత్రి 10 గంటలకు అన్నదమ్ములు గొడవపడ్డారు. తమ్ముడు అజయ్ సొంత అన్న సంజయ్‌కుమార్ (32) కొట్టాడు. కిందపడి తలకు పైపు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. యజమాని ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రావమ్మా.. మహాలక్ష్మి

- ఈనెల 14 నుంచి 19 వరకు స్పెషల్ బస్సులు
- వరుస సెలవుల నేపథ్యంలో..
- ఉమ్మడి జిల్లా డిపోల నుంచి 129 అదనపు సర్వీసులు



మంచిర్యాలఅర్బన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రయాణికులకు టీజీఆర్టీసీ శుభవార్త అందించింది. ఆయా డిపోల నుంచి ప్రధాన రూట్లతోపాటు హైదరాబాద్ నుంచి స్పెషల్ సర్వీసులు నడపనుంది. ఈనెల 15న స్వాతంత్ర దినోత్సవం, 16న వరలక్ష్మీ వ్రతం, 18 ఆదివారం సెలవు, 19న రాఖీ పౌర్ణమి ఇలా వరుస సెలవులు ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో ఉన్నవారు స్వగ్రామాలకు వెళ్లనున్నారు. ఈనేపథ్యంలో 14 నుంచి 19వ తేదీ వర కు ప్రత్యేక బస్సులు నడపనుంది. ఉమ్మడి జిల్లాలోని డిపోల ద్వారా జేబీఎస్ నుంచి 129 బస్సుల్లో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయనుంది.

మంచిర్యాల డిపో నుంచి..

మంచిర్యాల డిపో నుంచి ప్రధాన రూట్లు లక్సెట్టిపేట, జన్నారం, చెన్నూర్, గోదావరిఖని-కరీంనగర్ వరకు ప్రస్తుత బస్సులకు అదనంగా తిప్పేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 150 బస్సుల్లో రాజధాని-03, ఏసీ లహరి-04, నాన్ ఏసీ లహరీ-04, సూపర్‌లగ్జరీ-24, ఎక్స్‌ప్రెస్-06, పల్లె వెలుగు-39, ప్రైవేట్ ఎక్స్‌ప్రెస్-15, ప్రైవేట్ పల్లెవెలుగు-54 బస్సులున్నాయి. ఇందులో 145 బస్సుల ద్వారా 61 వేల కి.మీ మేర బస్సులు తిప్పుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. 5 బస్సులు ఎప్పుడు స్పేర్‌లో ఉండనున్నాయి. రాఖీ పండుగ వేళ ఒక్క బస్సు కూడా డిపోలో ఉండకుండా రోడ్లపై రయ్‌రయ్‌మంటూ తిరుగనున్నాయి. హైదరాబాద్‌లో ఉద్యోగ, వ్యాపార, చదువుల నిమిత్తం వెళ్లిన వారందరూ ఇంటిబాట పట్టనున్నారు. హైదరాబాద్ రెగ్యులర్‌గా 38 బస్సులు నడుపుతున్నారు. రాఖీ, వరుస సెలవుల నేపథ్యంలో మంచిర్యాల డిపో నుంచి ఈనెల 14నుంచి 16వరకు మూడు, 17న 18, 18న 10, 19న 18 బస్సులు తిప్పనున్నారు.

ఆయా డిపోల నుంచి..

ఈనెల 14 నుంచి 19వరకు జేబీఎస్ నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. భైంసా, ఉట్నూర్ డిపోలు మినహాయిస్తే రద్దీ నేపథ్యంలో జేబీఎస్ నుంచి ఆదిలాబాద్‌కు ఆదిలాబాద్ డిపో బస్సులు 21, ఆసిఫాబాద్ డిపో బస్సులు 23, మంచిర్యాల డిపో బస్సులు, నిర్మల్ డిపోకు చెందిన 30 బస్సులు మొత్తం 129 ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

మహాలక్ష్మి తర్వాత రాఖీ పండుగతో..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం అమలు చేసింది. దీంతో మహిళల ఉచిత బస్సు ప్రయాణం రెట్టింపయింది. దీనికితోడు రాఖీ పండుగకు రద్దీ ఉండనుండటంతో ఆయా బస్‌స్టేషన్లలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. శ్రావణమాసం ఛాలెంజ్‌లో భాగంగా మహాలక్ష్మి టికెట్లతో సంబంధం లేకుండా మంచిర్యాల డిపోకు రూ.21 లక్షల ఆదాయం టార్గెట్ విధించారు. వరుస సెలవుల నేపథ్యంలో బస్సులు తిప్పడం ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా అధికారులు నిర్ణయించారు.

ప్రత్యేక ఇన్సెంటివ్

మంచిర్యాల డిపోలో రోజుకు 61 వేల కి.మీ మేర బస్సులు రాకపోకలు సాగిస్తుండగా పండుగ నేపథ్యంలో మరో 6 వేల కి.మీ మేర అదనంగా బస్సులు నడపనున్నారు. ఉద్యోగులను ప్రోత్సహించేందుకు అడిషనల్‌గా విధులు నిర్వహించే కండక్టర్లకు కి.మీకి రూ.3 చొప్పున చెల్లించనున్నారు. ఉదాహరణకు ఆడిషనల్ 60 కి.మీ తిప్పితే రూ.3 చొప్పున 180 రూపేణా విధులు ముగియగానే చెల్లించనున్నారు.

ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం

రాఖీ సందర్భంగా ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. డిపో పరిధిలో హైదరాబాద్‌తోపాటు ప్రధాన రూట్లు కరీంనగర్, జన్నారం, ఆసిఫాబాద్, చెన్నూర్ రూట్లలో అదనపు బస్సులు నడపనున్నాం. జేబీఎస్ బస్‌స్టేషన్‌తోపాటు మంచిర్యాల డిపో వద్ద బస్సుల సమాచారం అందించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించాం.

– జనార్దన్, డిపో మేనేజర్, మంచిర్యాల

పగిలిన పైపు వాల్వు.. ఎగిసిపడిన నీరు



దిలావర్‌పూర్ మండలంలోని న్యూలోలం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం వాటర్ గ్రిడ్ పైప్‌లైన్ వాల్వు పగిలింది. రెండు గంటలపాటు నీరు నింగికి ఎగిసిపడింది. మాడేగాం గ్రామంలోని గుట్ట ప్రాంతంలో వాటర్‌గ్రిడ్ ట్రీట్‌ప్లాంట్ నుంచి నిర్మల్, ఆదిలాబాద్ వెళ్లే పైప్‌లైన్ వాల్వు వద్ద పగిలి నీరంతా వాటర్ ఫౌంటేన్‌లా ఎగజిమ్మింది. ఆ రోడ్డుగుండా వెళ్లేవారు, గ్రామస్తులు వీక్షించారు. – దిలావర్‌పూర్

రూ.80లక్షల నిధుల దుర్వినియోగం

- ఆదిలాబాద్ డీసీసీబీ డిప్యూటీ రిజిస్ట్రార్ సస్పెన్షన్

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కె.సింహాచలంపై సస్పెన్షన్ వేటు ప డింది. నిజామాబాద్ జిల్లా సహకారశాఖ అధికా రిగా పనిచేసిన సమయంలో సొసైటీలకు సంబంధించిన నిధులు దుర్వినియోగం చేస్తూ భారీగా అక్రమాలకు పాల్పడ్డారు. ఆయన అవినీతి బాగోతం బయటకు పొక్కడంతో చర్యల నుంచి తప్పించుకునేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో జిల్లాకు బదిలీపై వచ్చారు. అయితే ఆయన వ్యవహారంపై ప్రత్యేకాధికారితో విచారణ జరిపించిన ప్రభుత్వం రూ.80లక్షల మేర అక్రమాలకు పాల్పడినట్లుగా నిర్ధారించింది. ఈ మేరకు ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ డైరెక్టర్, కమిషనర్ ఆఫ్ కోఆపరేటీవ్ సొసైటీస్ ఉదయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

మామిడి చెట్లకొమ్మలు కత్తిరించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న సందీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: ప్రస్తుతం మామిడి తోటల్లో చెట్ల కొమ్మలు కత్తిరించడంతో పంట దిగుబడి పెరుగుతుందని ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి సందీప్‌కుమార్ అన్నారు. ఉట్నూర్‌లోని ఐటీడీఏ ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రంలో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. చెట్ల కొమ్మలు కత్తిరింపుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిఏటా నిలకడగా కాపు కాస్తుందని, చెట్టుకు గాలి, వెలుతురు బాగా సోకి దిగుబడి పెరుగుతుందన్నారు. ఉద్యన నర్సరీ, శిక్షణ కేంద్రంలో చెట్లకు కత్తిరింపులు స్వయంగా చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన నర్సరీ సాంకేతిక అధికారి కుమారి అర్షిత, ఎన్‌జీవోల ప్రతినిధులు సాక్రుబాయి, తిరుమలేశ్, న్యాను ఉన్నారు.

సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్తులు


ముట్టడిస్తున్న కొత్తూరు గ్రామస్తులు

తలమడుగు: మండలంలోని కొత్తూరు గ్రామంలో కరెంట్ సరఫరా లేకపోవడంతో గ్రామస్తులు మంగళవారం రాత్రి తలమడుగు సబ్‌స్టేషన్‌ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తూరులో దాదాపు 20 ఇళ్లకు వారం రోజులుగా సరఫరా లేకపోవడంతో చిమ్మచీకట్లో ఉండాల్సి వస్తుందన్నారు. ఈ విషయాన్ని అధికారులకు విన్నవిస్తే సరే..రేపు చేద్దామని అంటున్నారే తప్ప పనులు చేపట్టడం లేదన్నారు. ఏఈ, డీఈకి ఫోన్ ఫోన్ చేసినా స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆదిలాబాద్ చేరిన రాజీవ్ జ్యోతియాత్ర


యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కైలాస్‌నగర్: దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ ఐటీ రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నార్త్ చెన్నై ఈస్ట్ డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్, చెన్నై కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ శ్యామూల్ దిరవైయం సారథ్యంలో చేపట్టిన రాజీవ్‌గాంధీ జ్యోతి యాత్ర మంగళవారం జిల్లా కేంద్రానికి చేరింది. ఈ యాత్ర బృందానికి పార్టీనేతలతో కలిసి కంది ఘన స్వాగతం పలికారు. తన క్యాంపు కార్యాలయానికి వచ్చిన బృంద సభ్యులతో కంది మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సభ్యులు ఆయనకు జ్యోతిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన రాజీవ్‌గాంధీని స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. కన్యాకుమారి నుంచి ప్రారంభమై ఈ యాత్ర శ్రీపెరంబుదూర్ వరకు చేరుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నగేశ్, నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

‘కల్యాణలక్ష్మి’ కాజేసిండ్రు..!

- లబోదిబోమంటున్న ఆదివాసీలు
- ఆలస్యంగా వెలుగులోకి
- న్యాయం చేయాలంటూ ఆందోళన
- ఇచ్చోడ మండలంలో ఘటన


కల్యాణలక్ష్మి దరఖాస్తులతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న యువతుల తల్లిదండ్రులు

ఇచ్చోడ: ఆ ఆడపడుచులకు అప్పటికింకా వివాహం కాలేదు.. అయినా సర్కారు అందజేసే కల్యాణలక్ష్మి కానుకను వారి పేరిట కొందరు కాజేశారు.. ఈ ఘటన ఇచ్చోడ మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బావోజీపేట్‌కు చెందిన ముగ్గురు ఆదివాసీ యువతులకు ఆరేళ్ల క్రితం పెళ్లి కాకున్నా అయినట్లుగా కొందరు కల్యాణలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేశారు. వారి పేరిట చెక్కులు సైతం పంపిణీ అయినట్లు రెవెన్యూ రికార్డులో నమోదైంది. అయితే ఇందులో ఒక యువతికి మూడేళ్ల క్రితం, మరో ఇద్దరికి ఈ ఏడాది వివాహాలు అయ్యాయి. అర్హులైన వారి తల్లిదండ్రులు కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేసుకున్నారు. నెలలు గడుస్తున్నా మంజూరు కావడం లేదు. ఈ క్రమంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. అధికారులను సంప్రదించగా ఆరేళ్ల క్రితమే వారి ఆధార్ కార్డులపై చెక్కులు మంజూరైనట్లు పేర్కొనడంతో అవాక్కయ్యారు. తమకు న్యాయం చేయాలంటూ కార్యాలయం ఎదుట వారు ఆందోళనకు దిగారు.

ఆలస్యంగా వెలుగులోకి..

బావోజీపేట్‌కు చెందిన ఆదివాసీ యువతి మండాడి ఎత్మబాయికి మే 2021లో వివాహమైంది. అలాగే గ్రామానికి చెందిన యువతులు మల్లవ్వకు ఈ ఏడాది ఫిబ్రవరిలో, కుడిమేత పంచబాయికి ఈ ఏడాది మేలో పెళ్లిళ్లు జరిగాయి. వివాహ అనంతరం వారి తల్లిదండ్రులు కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. నెలలు గడిచినా చెక్కులు అందడం లేదు. ఈక్రమంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న వారు డిప్యూటీ తహసీల్దార్‌ను సంప్రదించారు. అయితే ఆయన ఆన్‌లైన్‌లో చూడగా..ముగ్గురు యువతులకు సంబంధించిన కల్యాణలక్ష్మి చెక్కులు 2018-19లోనే మంజూరై పంపిణీ చేసినట్లు రికార్డుల్లో నమోదై విషయాన్ని వెల్లడించారు. వారి వయస్సులను మార్పిడి చేసి ఈ అక్రమానికి పాల్పడినట్లు గుర్తించారు. తమకు న్యాయం చేయాలంటూ దరఖాస్తుదారులు ఆందోళనకు దిగారు. కాగా, 2018లో మండలంలో కల్యాణలక్ష్మి పథకంలో భారీ అవినీతి జరిగినట్లు వెలుగులోకి రాగా నాడు కేసులు కూడా నమోదవడం గమనార్హం.

గిరి గ్రామాల్లో శివబోడి పూజలు


గట్టెపల్లి శివారులో పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: శ్రావణమాసం పురస్కరించుకొని మండలంలోని గిరి గ్రామాల్లో ఆదివాసీలు మంగళవారం శివబోడి పూజలు నిర్వహించారు. గట్టెపల్లి, టికిడిగూడ, కొలాంగూడ, చిత్తగూడ, హనుమన్‌గూడ గ్రామాల శివారులో దేవతలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణంలో దేవతలకు పూజలు చేస్తే గ్రామాలకు ఎలాంటి కీడు రాదని, ప్రజలు, మూగజీవులు ఆయురారోగ్యంతో ఉంటారని ఆదివాసీల నమ్మకం. డొంగురావ్, గోవింద్, రాంషావ్ తదితరులు ఉన్నారు.

వాగు దాటి వైద్యం


వాగు దాటుతున్న వైద్య సిబ్బంది


ధన్నుగూడలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

నార్నూర్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగాయి. మంగళవారం నార్నూర్ పీహెచ్‌సీ హెచ్ఈవో రాథోడ్ తులసీదాస్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, సిబ్బంది మండలంలోని బాబేఝరి పంచాయతీ పరిధిలోని ధన్నుగూడ వెళ్లేందుకు వాగు దాటారు. 3 కి.మీ కాలినడకన వెళ్లి గ్రామానికి చేరుకుని వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గర్భిణులతోపాటు ఇంటింటికి వెళ్లి వైద్యపరీక్షలు చేసి రక్త నమూనాలు సేకరించారు. నిల్వ ఉన్న వర్షపు నీటిని పారబోశారు. ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు, ఏఎన్ఎం మాన్కుబాయి, ఈశ్వరి, అంగన్‌వాడీ టీచర్ మల్లు, చంపాబాయి, ఆశ కార్యకర్తలు రూపాబాయి, ఎత్మాబాయి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

గంజాయి నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: గతేదాది నవంబర్‌లో ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో 37 కిలోల గంజాయిని టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ఐదుగురు నిందితులు ఉండగా, ఇదివరకు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొంత కాలంగా తప్పించుకుని తిరుగుతున్న మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన షేక్ ఖుర్భాన్‌ను మంగళవారం రైల్వేస్టేషన్‌లో పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో సంతోష్ అక్రమంగా రోడ్డుపై నిర్మాణం చేపట్టాడని కాలనీవాసులు ఇటీవల మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సిబ్బంది కాలనీకి వచ్చి నిర్మాణ పనులు పరిశీలించారు. కోపోద్రిక్తుడైన సంతోష్ కాలనీవాసులు ఆవుల శివన్న, సత్యనారాయణ, ప్రసాద్, నవనీత్, కృష్ణవిహార్, నరేందర్‌లపై దుర్భాషలాడడంతోపాటు దాడికి యత్నించినట్లు వారు తెలిపారు. మంగళవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి ఏడురోజుల జైలు

జైపూర్: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి ఏడు రోజుల జైలుశిక్ష విధిస్తూ చెన్నూర్ కోర్టు జడ్జి రవి మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం..జైపూర్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించగా మంచిర్యాల వైపు నుంచి చెన్నూర్ వైపు వెళ్తున్న లారీని ఆపారు. డ్రైవర్ ఆర్కే గజానంద్‌కు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష చేయగా మద్యం తాగినట్లు రుజువైంది. చెన్నూర్ కోర్టులో హాజరుపర్చగా నేరం రుజువు కావడంతో ఈ మేరకు జడ్జి తీర్పు వెలువరించారు.

భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి


వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నిర్మల్‌ఖిల్లా: భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కైలాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జుమ్మెరాత్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య 89వ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని భగత్‌సింగ్ జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కైలాష్ మాట్లాడుతూ దేశస్వాతంత్ర్యం కోసం 89 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏఐఎస్ఎఫ్ విద్యార్థి ఉద్యమంలో అనేక కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు నరేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న రాజిరెడ్డి

చెన్నూర్‌రూరల్: మండలంలోని గంగారం గ్రామంలో తాటికొండ చంద్రయ్య ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చంద్రయ్య తన భార్యతో కలిసి సోమవారం రాత్రి చెన్నూర్‌లోని తన కూతురు ఇంటికి వెళ్లాడు. ఇంట్లో దేవుని చిత్రపటం వద్ద దీపం వెలిగించి పోయారు. అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అప్పటికే బీరువాలో రూ.3.50లక్షలతోపాటు తులం బంగారం, 7 క్వింటాళ్ల బియ్యం, వెండిపట్ట గొలుసులు, సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.8లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. సంఘటనా స్థలాన్ని ఆర్ఐ రంజిత్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి మంగళవారం పరిశీలించారు.

రోడ్డు ప్రమాదం కేసులో వ్యక్తికి ఏడాది జైలు

నస్పూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కా రణమైన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ మంచిర్యాల ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ జడ్జి ఫస్ట్ క్లాస్ డి.ఉపనిషద్వని మంగళవారం తీర్పు వె లువరించారు. జులై 7, 2017లో కట్కూరి లింగయ్య.. పట్టణ పరిధిలోని నస్పూర్ గేట్ వద్ద 63వ జాతీయ రహదారి దాటుతున్నాడు. ఆనందం ప్రైవేటు బస్సును అతివేగంగా వచ్చి లింగయ్యను ఢీకొని గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ లింగయ్య మృతిచెందాడు. అప్పటి సీసీసీ నస్పూర్ ఎస్సై దత్తాత్రి కేసు నమోదు చేశారు. పీపీ సహీన్ సుల్తానా సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో ఈమేరకు జడ్జి తీర్పునిచ్చారు.

ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని అంబేద్కర్‌చౌక్ నుంచి శివాజీచౌక్ వెళ్లేదారిలో కొందరు తోపుడు బండ్లను పెట్టి వ్యాపారం చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని పలువురు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్ అక్కడికి చేరుకొని తొలగించాలని సూచించారు. ఓ పార్టీకి చెందిన నాయకులు అక్కడికి చేరుకొని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. అదేవిధంగా అంబేద్కర్‌చౌక్ నుంచి గాంధీ చౌక్ వరకు మధ్యలో ఉన్న డివైడర్ పక్కనే తోపుడు బండ్లు ఉండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. వాటిని అక్కడి నుంచి తొలగించి వేరే చోట పెట్టించాలని పలువురు పేర్కొంటున్నారు.